క్లుప్తంగా

నేడు విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాల పంపిణీ

గండేపల్లి: మండలంలోని విభిన్న ప్రతిభావంతులకు సోమవారం ఉపకరణాలు పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీఓ నాతి బుజ్జి శనివారం తెలిపారు. జగ్గంపేట బస్టాండ్ ఎదురుగా గల పాత పోలీస్ స్టేషన్ ఖాళీ స్థలంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఉపకరణాలను అందజేస్తారన్నారు. లబ్ధిదారులు ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్, గత నెలలో నిర్వహించిన క్యాంపులో ఇచ్చిన రసీదు తీసుకురావాలని కోరారు.

ఆర్టీసీ కార్మికుల దీక్షకు సంఘీభావం



ఏలేశ్వరంలో కార్మికులతో కలిసి ఆందోళన చేస్తున్న వినోద్ మిశ్రా పార్టీ శ్రేణులు

ఏలేశ్వరం: స్థానిక ఆర్టీసీ డిపోలో కండక్టర్‌ను అక్రమంగా సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ కార్మికులు చేస్తున్న రిలే దీక్షలకు సీపీఐ (ఎంఎల్) వినోద్ మిశ్రా పార్టీ సంఘీభావం తెలిపింది. వినోద్ మిశ్రా పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ దీక్షా శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు అండగా ఉండాల్సిన యాజమాన్యం వేధింపులకు పాల్పడడం దారుణమన్నారు. కార్మికుల సమస్య పరిష్కామయ్యే వరకు తమ పార్టీ అండగా ఉంటుందన్నారు. అనంతరం ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీతో కలిసి ధర్నా చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు యుబీఎం కుమార్, కె.మాణిక్యం, కె.త్రిమూర్తులు, ఎస్పీ రావు, నానిబాబు, చలం తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వీల్‌చైర్ల పంపిణీ



తునిలో దివ్యాంగుడికి వీల్‌చైర్ పంపిణీ చేస్తున్న రోటరీ ప్రతినిధులు

తుని: స్థానిక రోటరీక్లబ్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఆదివారం వీల్‌చైర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు చెక్కా శ్రీధర్ మాట్లాడుతూ సమాజ సేవలో రోటరీ క్లబ్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి దండెం కృష్ణ, ట్రెజరర్ మురళీ, ప్రతినిధులు దొరబాబు, బుజ్జీ, దండెం రామకృష్ణ, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

సారా స్థావరాలపై పోలీసుల దాడి



టి.రాయవరం శివారులో పులిసిన ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

ప్రత్తిపాడు: మండలంలోని టి.రాయవరం గ్రామ శివారులో సారా స్థావరాలపై ఆదివారం ప్రత్తిపాడు పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 300 లీటర్ల బెల్లపు ఊట, సారా తయారీ సామగ్రిని ధ్వంసం చేసినట్టు స్థానిక ఎస్సై ఎస్. లక్ష్మి తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా సారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు, రేపు పంచాయతీ వార్డు సభ్యులకు శిక్షణ

రౌతులపూడి: మండలంలోని పంచాయతీ ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు సోమవారం నుంచి రెండు రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ జి.శివరామకృష్ణయ్య ఆదివారం తెలిపారు. గ్రామ పంచాయితీ పరిపాలనా విధానం, ఏపీపీఆర్ చట్టం, పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణ, తాగునీటి సరఫరా తదితర అంశాలపై శిక్షణ ఇస్తారన్నారు. మండలంలోని పంచాయతీ వార్డు సభ్యులు తప్పనిసరిగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అలరించిన నృత్య ప్రదర్శన



రామరాయ కళావేదికపై నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో రామరాయ కళావేదికపై ఆదివారం చిన్నారుల నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్యం, పలు భక్తి గీతాలకు నృత్యాలు అందరినీ అలరించారు. పది మంది చిన్నారులు ఈ నాట్య ప్రదర్శనలో పాల్గొని అందరి ప్రశంసలు పొందారు.

వసతులు నిల్.. వైద్య సేవలు డల్

- ములగపూడి పీహెచ్‌సీలో కనీస సౌకర్యాలు కరవు
- సిబ్బంది కొరతతో ఇబ్బంది పడుతున్న రోగులు
- నత్తనడకగా సాగుతున్న పీహెచ్‌సీ భవన నిర్మాణ పనులు
- మెరుగైన చికిత్స కోసం ఇతర ప్రాంతాలకు తరలివెళ్తున్న రోగులు



ప్రస్తుతం రోగులకు సేవలందిస్తున్న పీహెచ్‌సీ భవనం

రౌతులపూడి: మండలంలోని ములగపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) సమస్యల వలయంలో చిక్కుకుంది. పీహెచ్‌సీ పరిధిలోని రోగులకు మెరుగైన వైద్యం అందకపోవడంతో ఇతర ప్రాంతాల్లోని ఆసుపత్రులకు తరలివెళ్లడం తప్పడం లేదు. ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించకపోవటంతో గ్రామాల్లోని ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు వంటి ఆరోగ్య సిబ్బందిని ఆసుపత్రిలో షిఫ్టుల వారీగా నియమిస్తూ కాలం గడుపుతున్నారు. ఆసుపత్రిలో పనిచేసే వైద్యులు, ఇతర గ్రామాల నుంచి వచ్చి సేవలందిస్తున్న ఆరోగ్య సిబ్బందికి కనీస అవసరాలు తీర్చుకునేందుకు అవసరమైన మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం, పూర్తిస్థాయి గదులు లేకపోవడంతో నిత్యం అవస్థలు పడుతున్నారు.

14 మందికి ఇద్దరే..

సాధారణంగా పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులతో పాటు స్టాఫ్ నర్సులు, ఎస్ఎన్ఓ, ఎంఎన్ఓలు, ఫార్మాసిస్టు, అకౌంటెంట్, వాచ్‌మెన్ వంటి 14 మంది సిబ్బందిని నియమించాలి. ఇన్‌పేషెంట్లకు సేవలందించడానికి కనీసం పది బెడ్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఇద్దరు వైద్యులు మినహా ఇప్పటివరకూ ఎలాంటి సిబ్బందిని, రోగులకు బెడ్ల సదుపాయం గానీ ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. పలు రోగాలతో బాధపడతూ ఆసుపత్రికి వచ్చే వందల సంఖ్యలో అవుట్ పేషెంట్లు, పదుల సంఖ్యలో ఇన్‌పేషెంట్లకు ఆసుపత్రిలో సేవలందించాల్సి ఉంది. ఆసుపత్రి భవనం పైకప్పు శిథిలమై పెచ్చులు ఊడిపడటంతో ఇన్‌పేషెంట్లకు వైద్య సేవలు అందించడానికి తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది.



నత్తనడకన సాగుతున్న పీహెచ్‌సీ భవన నిర్మాణం

ఒక్కరితోనే సేవలు

ప్రస్తుతం ఉన్న ఇద్దరు వైద్యుల్లో ఒకరు ఆసుపత్రిలో సేవలు అందిస్తుండగా మరొకరు గ్రామాల్లోని ప్రజలకు వైద్య సేవలు అందివ్వటం కోసం ఏర్పాటు చేసిన 104లో సేవలందిస్తున్నారు. ఇతర గ్రామాల నుంచి రోజుకు ఒక గ్రామంలోని ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలను రోగులకు సేవలందించడానికి వినియోగిస్తున్నారు. దీంతో గ్రామాల నుంచి వచ్చే గర్భిణులు, రోగులకు పరీక్షలు, మెరుగైన చికిత్స కోసం రౌతులపూడి సీహెచ్‌సీకి వెళ్లాల్సి వస్తోంది. ఆసుపత్రి పీహెచ్‌సీ పరిధిలో ములగపూడి, బలరామపురం, ఎ.మల్లవరం, లచ్చిరెడ్డిపాలెం, ఎస్ఎస్ పట్నం, రౌతులపూడి-1, రౌతులపూడి-2, రాజవరం, గంగవరం సచివాలయాల పరిధిలోని గర్భిణులు, ఇతర రోగాల బారిన పడిన ప్రజలు ఈ పీహెచ్‌సీలో వైద్య సేవలు పొందాల్సి ఉంది. స్థానిక పీహెచ్‌సీలో ఎలాంటి సదుపాయాలు లేకపోవటంతో రౌతులపూడి సీహెచ్‌సీ ఇతర ప్రాంతాల్లోని ప్రైవేటు ఆసుపత్రులకు తరలి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న ములగపూడి పీహెచ్‌సీ వైద్యురాలు సౌందర్య

ఏడాదిగా పూర్తికాని పనులు

గతేడాది ములగపూడిలో ఏర్పాటు చేసిన పీహెచ్‌సీకి భవన సదుపాయం కల్పించేందుకు గాను అప్పటి ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ చొరవ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైద్యారోగ్య శాఖ రూ.2.45 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో భవన నిర్మాణానికి గతేడాది జూన్ 10న శంకుస్థాపన చేశారు. అప్పటినుంచి భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో రోగులు, సిబ్బంది నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పీహెచ్‌సీ భవన నిర్మాణాన్ని త్వరితగతిని పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

పీహెచ్‌సీ భవనాన్ని త్వరగా పూర్తి చేయాలి



ములగపూడిలో ఏర్పాటు చేసిన పీహెచ్‌సీలో వసతులు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రిలో సమస్యలను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, డీఎంఅండ్‌హెచ్ఓ దృష్టికి తీసుకువెళ్లాను. ఆసుపత్రికి వచ్చే రోగుల అవస్థలను గుర్తించి తక్షణమే పీహెచ్‌సీ భవన నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలి.

– తమరాన సత్యనారాయణ, సర్పంచ్ ములగపూడి

జిల్లా ఉన్నతాధికారులకు నివేదించాం

పీహెచ్‌సీలో మౌలిక సదుపాయాలు, ఇన్‌పేషెంట్లకు అవసరమైన బెడ్లు, పరికరాలు, సిబ్బంది నియామకం, ఆసుపత్రిలోని ప్రస్తుత పరిస్థితిని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. భవన నిర్మాణానికి అవసరమైన నిధులు విడుదలపై అధికారులకు నివేదించాం. మరోసారి పీహెచ్‌సీలోని సమస్యలు, భవన నిర్మాణంపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

– డాక్టర్ సౌందర్య, వైద్యురాలు, పీహెచ్‌సీ

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం



కత్తిపూడిలో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ కార్మికులు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు కత్తిపూడి సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. మండలంలోని కత్తిపూడిలో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీత తీయించారు. గ్రామం నలుమూలల బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్తిబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

వచ్చే నెల 4న కోటి బిల్వార్చన

ప్రత్తిపాడు: స్థానిక మినర్వా కళాశాల ఎదురుగా ఉన్న పడాల గోపాలకృష్ణారెడ్డి మైదానంలో వచ్చే నెల 4న అయ్యప్ప స్వామికి కోటి బిల్వార్చన, లక్ష దీపోత్సవం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ప్రత్తిపాడులో ఆదివారం సాయంత్రం నిర్వాహక కమిటీ సమావేశం జరిగింది. పంబా శ్రీధర్మశాస్తా సన్నిధిలో దండపాణి గురుస్వామి శతజయంతి మహోత్సవాల నిర్వహణ, అయ్యప్ప స్వామివారి ఊరేగింపు నిర్వహించేందుకు కమిటీ నిర్ణయించింది. ఈ కార్యక్రమానికి శబరిమలై సన్నిదానం ఆలయ ప్రధాన పూజారి మేల్ శాంతి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.

వైభవంగా బోనాల పండగ



ప్రత్తిపాడు మండలం ఏలూరులో బోనాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ



ధర్మవరంలో బోనాలతో ఊరేగింపుగా తరలివెళ్తున్న మహిళలు

ప్రత్తిపాడు: మండలంలో ఏలూరులో వేంచేసిన కనకదుర్గమ్మ ఆలయం వద్ద ఆదివారం అమ్మవారి బోనాల సంబరం కన్నులపండువగా జరిగింది. భవానీ భక్తులు, మహిళలు బోనాలు శిరస్సున దాల్చి పురప్రదర్శన చేశారు. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక మహిళలతో కలిసి ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ బోనాలు శిరస్సున దాల్చి, అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ రొంగల సత్యనారాయణ, అడ్డాల త్రిమూర్తులు, కొట్టేటి అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమ పూజలు

ఏలేశ్వరం: దేవీ శరన్నవ రాత్రుల్లో భాగంగా పట్టణంలో ఆదివారం మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. స్థానిక తోటవీధిలోని దుర్గాదేవి ఆలయం వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అర్చకుడు వీరభద్రరావు మహిళలతో కుంకుమ పూజలు చేయించారు. అలాగే ఆర్టీసీ కాంప్లెక్స్, సంతోషిమాత ఆలయం, సువ్వయ్యమ్మ పేట వద్ద గల అమ్మవారి ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా మండలంలోని ధర్మవరంలో ఆదివారం బోనాల సంబరం ఘనంగా నిర్వహించారు. భవానీలు, మహిళా భక్తులు అమ్మవారి బోనాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం విజయదుర్గ అమ్మవారికి బోనాలను సమర్పించారు. స్థానిక భక్తులు అమ్మవారికి సారె, చీర సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు.



ఏలేశ్వరంలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

అమ్మవారికి బంగారు పుష్పాల సమర్పణ



గోకవరంలో దేవీచౌక్ ఆలయానికి బంగారు పుష్పాలు అందిస్తున్న భక్తులు

గోకవరం: దేవీచౌక్ ఆలయంలో కొలువైన కనకదుర్గమ్మ నిత్య పూజల కోసం గ్రామానికి చెందిన దాత మామిడి బదిరీనారాయణరావు ఆరు బంగారు పుష్పాలను సమర్పించారు. ఆరుగ్రాములతో తయారు చేయించిన వీటిని ఉదయం ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులకు దాత కుటుంబ సభ్యులు అందజేశారు. అలాగే గ్రామానికి చెందిన బొడ్డు రాజు, ప్రభావతి దంపతులు 50 గ్రాముల వెండిని అమ్మవారి వెండి తాపడానికి అందజేశారు. పలువురు భక్తులు వెండి, బంగారు ఆభరణాలను అమ్మవారికి సమర్పించారు.

ప్రశాంతంగా టెట్

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఆదివారం నిర్వహించిన ఏపీ టెట్ ఆన్‌లైన్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్టు డైరెక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షలకు 220 మందికి గాను 186 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 224 మందికి గాను 185 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్టు తెలిపారు.



గోకవరంలో దేవీచౌక్ ఆలయం వద్ద ఆకట్టుకుంటున్న విద్యుత్ కాంతులు

గోకవరం: గ్రామంలో ప్రసిద్ధిగాంచిన దేవీచౌక్ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ కాంతులు ఆకట్టుకుంటున్నాయి. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి మొదలుకొని రమాసత్యనారాయణ స్వామి ఆలయం వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా విద్యుత్ దీపాలను అలంకరించారు. ఈ విద్యుత్ దీపాల్లో అయోధ్య రామమందిరం, శేషపాన్నుపై శయనిస్తున్న శ్రీనివాసుడు, అమ్మవారు, ఇతర దేవత విద్యుత్ అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



అయోధ్య రామమందిరం విద్యుత్ సెట్టింగ్



ప్రధాన రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు

లలితాదేవి.. లోకపావని

- విశేష అలంకరణలో దర్శనమిచ్చిన జగన్మాత
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు

తుని రూరల్: లోవ దేవస్థానంలో కొలువైన తలుపులమ్మ అమ్మవారికి దసరా ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం లలితాదేవి అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

శారదా మాతగా దర్శనమిచ్చిన వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లు

అన్నవరం: రత్నగిరిపై దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం రత్నగిరిపై వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లను శారదా దేవిగా అలంకరించి పూజించారు. ఒక చేతిలో పుస్తకం, మరో చేతిలో గులాబీ, మిగిలిన రెండు చేతులను అభయహస్తాలుగా చూపుతూ దర్శనమిచ్చిన అమ్మవార్లను అధిక సంఖ్యలో భక్తులు దర్శించి పూజలు చేశారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకు దర్బారు మండపంలో రుత్విక్కులు చండీ సప్తశతీ పారాయణలు, రామాయణ, మహాభారత పారాయణ, మహాలింగార్చన, సూర్యనమస్కారాలు నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరు గంటల వరకూ అమ్మవార్లకు రుత్విక్కులు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు. రాత్రి ఏడు గంటల నుంచి సత్యదేవుని ఆలయంలో స్వామి, అమ్మవార్లకు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి ప్రసాదాలు నివేదించారు. ఆలయ ప్రధానార్చకులు ఇంద్రగంటి నర్శింహమూర్తి, కోట సుబ్రహ్మణ్యం, కల్యాణబ్రహ్మ చామర్తి కన్నబాబు, వనదుర్గ, కనకదుర్గ ఆలయ అర్చకులు కోట వంశీ, కంచిబట్ల సాయిరామ్ ఆధ్వర్యంలో అమ్మవార్లకు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.



రాచపల్లిలో లలితా త్రిపుర సుందరీదేవిగా అపిత కూచాంబ అమ్మవారు



రత్నగిరిపై శారదా దేవి అలంకరణలో వనదుర్గ అమ్మవారు



రత్నగిరిపై శారదాదేవిగా దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ



తునిలో రాజరాజేశ్వరీదేవిగా దర్శనమిస్తున్న వాసవీమాత

కిర్లంపూడి: శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా నాల్గోరోజు ఆదివారం మండలంలోని రామచంద్రపురంలో వేంచేసిన కనకదుర్గమ్మ వారిని లలితాత్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. జగపతినగరంలో అభయ దుర్గమ్మ అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. కిర్లంపూడి వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు.

బాలాత్రిపుర సుందరీదేవిగా అమ్మవారు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లి అరుణాచలేశ్వరస్వామి దేవస్థానంలో దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అపిత కూచాంబ అమ్మవారు, ధర్మవరంలో విజయదుర్గా అమ్మవారు, గజ్జనపూడిలో రాజారాజేశ్వరి అమ్మవారు ఆదివారం బాలాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రాజరాజేశ్వరీదేవిగా వాసవీమాత

తుని: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా స్థానిక వాసవీమాత ఆదివారం భక్తులకు రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేదపండితులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



లలితాదేవి అలంకరణలో లోవ తలుపులమ్మ అమ్మవారు

మీనాక్షిదేవిగా దర్శనమిచ్చిన నేరేళ్లమ్మ

తొండంగి: దసరా ఉత్సవాల్లో భాగంగా మండలంలోని గోపాలపట్నం నేరేళ్లమ్మ అమ్మవారు ఆదివారం మీనాక్షిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. సోమవారం అమ్మవారి ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహకుడు యడ్ల శ్రీనివాస్ తెలిపారు.

కోటనందూరు: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా కాకరాపల్లి కనకదుర్గమ్మ ఆదివారం లలితా త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గోకవరం: స్థానిక దేవీచౌక్ ఆలయంలో కొలువైన కనకదుర్గమ్మ ఆదివారం లలితాత్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజాము నుంచి ఆలయ అర్చకులు డాక్టర్ వల్లూరి జగన్నాథశర్మ, వల్లూరి శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు.



గోపాలపట్నంలో మీనాక్షి అలంకరణలో నేరేళ్లమ్మ అమ్మవారు



గోకవరంలో లలితాత్రిపురసుందరీ దేవిగా దర్శనమిస్తున్న కనకదుర్గమ్మ



కాకరాపల్లిలో లలితాత్రిపురసుందరిగా దర్శనమిస్తున్న కనకదుర్గమ్మ



రామచంద్రపురంలో లలితా త్రిపుర సుందరిగా దర్శనమిచ్చిన కన్నదుర్గమ్మ